క్లుప్తంగా

అమ్మవారికి కుంకుమ పూజలు


రాజరాజేశ్వరిదేవికి పూజలు చేస్తున్న భక్తులు

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామంలో రాజరాజేశ్వరిదేవి ఆలయంలో మంగళవారం కనుమ సందర్భంగా కుంకుమ పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు దూసి శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అయోధ్య అక్షతల పంపిణీ


అయోధ్య అక్షతలను పంపిణీ చేస్తున్న భజన మండలి సభ్యులు

బొండపల్లి: మండలంలోని రోళ్లవాక గ్రామంలోని రామాలయంలో అయోధ్య రామాలయం నుంచి తీసుకొచ్చిన అక్షతలకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాటిని ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ నెల 22 అయోధ్య రామాలయం ప్రాణప్రతిష్ట సందర్భంగా రామాలయం చిత్రపటాన్ని భజన మండలి ఆధ్వర్యంలో ఊరేగించారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు


పూజలందుకుంటున్న వేణుగోపాలస్వామి

జామి: మండలంలో అన్నంరాజుపేట పంచాయతీ పుష్పగిరి వేణుగోపాలస్వామి ఆలయంలో సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఫణిహారం సీతరామాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న 'రేపటి యజ్ఞం'


నాటిక ప్రదర్శిస్తున్న మహేశ్వరావు

గంట్యాడ: సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలోని చినమానపురం గ్రామంలో 'రేపటి యజ్ఞం' అనే నాటికను ప్రదర్శించారు. గ్రామానికి చెందిన పాశల మహేశ్వరావు మాస్టారు ఈ నాటికను ప్రదర్శించారు. పల్లెల అభివృద్ధి, పచ్చదనంపై సందేశాన్ని ఇచ్చారు.

కుక్కల బెడద


గజపతినగరం మండల కేంద్రంలో గుంపుగా సంచరిస్తున్న కుక్కలు

గజపతినగరం: గజపతినగరం, పురిటిపెంట మేజర్ పంచాయతీల్లో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉంది. వీధుల్లో గుంపులుగా తిరుగుతూ ఒంటరిగా వెళ్లేవారిపై దాడులు చేస్తున్నాయి. కుక్కల గుంపులను చూసి ప్రజలు భయపడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి వాటిని అదుపు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా గోపూజోత్సవం


గోమాతకు పూజలు నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్ రెడ్డి

విజయనగరం టౌన్: టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో మంగళవారం గో పూజోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. టీటీడీ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ జె.శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవును పూజిస్తే సకల దేవతలను పూజించినట్లేనని పేర్కొన్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని గోవులకు పూజలు చేసి, ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. స్థానిక కంటోన్మెంట్ గూడ్స్ షెడ్ వద్దనున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో గోపూజోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఆలయ కమిటీ ట్రస్ట్ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. సకల దేవతల సమాహారం గోమాతని, ప్రత్యక్ష్యంగా దేవతలకు పూజలు చేసినట్లేనని తెలిపారు.

సరదాల సంక్రాంతి


శృంగవరపుకోట: పెదఖండేపల్లిలో కనుమ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

తెలుగువారి పెద్ద పండగ సంక్రాంతిని ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ల ముందు రంగవల్లులు వేసి అందంగా అలంకరించారు. చిన్నారులు, పెద్దలు సంప్రదాయ వస్త్రాలు ధరించి పూర్వీకులకు పూజలు చేశారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి పిండివంటలు ఆరగించారు. రోజంతా సరదాగా గడిపారు. మంగళవారం కనుమ పండగ సందర్భంగా గోమాతకు పూజలు చేశారు. దత్తిరాజేరు మండలం గుచ్చిమిలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో, ఎస్.కోట మండలం పెదఖండేపల్లిలో నిర్వహించిన కనుమ వేడుకల్లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పాల్గొని సందడి చేశారు. సూర్యుడు ధనురాశి నుంచి మకరరాశిలోకి ప్రవేశించే రోజు మకర సంక్రాంతిగా జరుపుకుంటారు.

– సాక్షి నెట్‌వర్క్


దత్తిరాజేరు: స్వగ్రామం గుచ్చిమిలోని రామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


గుర్ల: విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు


గజపతినగరం: ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో క్రికెట్ ఆడుతున్న యువత


బొండపల్లి: పశువులకు బొట్టు పెట్టి పూజలు చేస్తున్న రైతులు, చిన్నారులు


చీపురుపల్లి: కనకమహాలక్ష్మి ఆలయ ప్రాంగనంలో గోమాతకు పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు


కొత్తవలస: కొత్తవలస గ్రామంలో సంక్రాంతి వేడుకల్లో ఒక కుటుంబం

ప్రగతిపథంలో రామవరం

- రూ.కోటితో గ్రామంలో అభివృద్ధి పనులు
- అన్నివీధుల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు


గ్రామంలో మధ్యవీధిలో వేసిన సీసీరోడ్డు



గ్రామ సచివాలయ భవనం

గంట్యాడ: మండలంలోని అతి పెద్ద గ్రామపంచాయతీ రామవరం. టీడీపీ హయాంలో అభివృద్ధికి దూరంగా ఉన్న ఈ గ్రామం నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రగతి పథంలో పయనిస్తోంది. సుమారు 5 వేల నుంచి 6 వేలు జనాభా ఉన్న ఈ గ్రామంలో గతంలో సీసీరోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో మురుగునీరు వీధుల్లో చేరి అధ్వానంగా ఉండేది. నేడు గ్రామంలోని అన్ని వీధుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. రూ.40 లక్షలతో గ్రామ సచివాలయ భవనాన్ని నిర్మించారు. సంక్రాంతి పండగకు సొంతూరు వచ్చిన వారు గ్రామంలో చేపట్టిన అభివృద్ధిని చూసి ఊరు చాలా మారిపోయిందని చర్చించుకుంటున్నారు. టీడీపీ పాలనకు, వైఎస్సార్‌సీపీ పాలనకు బేరీజు వేసుకుంటున్నారు.

అభివృద్ధిలో ఆదర్శంగా..



మా గ్రామాన్ని అభివృద్ధిలో ఇతర గ్రామాలకు ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దాం. గ్రామంలో సుమారు రూ.60 లక్షలతో అన్ని వీధుల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించాం. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపడుతున్నాం. పండగకు వచ్చిన వారంతా గ్రామాభివృద్ధిపై చర్చించుకుంటున్నారు.

– పీరుబండి పద్మావతి, ఎంపీపీ, గంట్యాడ

ఘనంగా మంగమ్మ పేరంటాల జాతర


రాజాం: బొద్దాంలో మంగమ్మతల్లి పేరంటాలుకు మొక్కులు చెల్లిస్తున్న ఉత్తరాంధ్ర రజకకుల సంక్షేమ సంఘ సభ్యులు

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామంలో మంగమ్మ పేరంటాలు జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన రజకుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఘటాలు ఊరేగించి, అమ్మవారికి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సేవలతోనే గుర్తింపు



హెల్త్‌ఎడ్యుకేటర్ గోపిని సత్కరిస్తున్న ట్రైనీ డీఎస్పీ మహేంద్ర

బొండపల్లి: ఏ రంగంలో పనిచేస్తున్న వారికైనా ఆయా రంగాల్లో వారందించిన సేవలే వారికి గుర్తింపునిస్తాయని ట్రైనీ డీఎస్పీ ఎస్.మహేంద్ర అన్నారు. మండలంలోని నెలివాడ గ్రామంలో బొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ ఎడ్యుకేటర్‌గా పనిచేస్తున్న మాచర్ల గోపిని మంగళవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ గత 25 ఏళ్లుగా రోగులకు సేవలందిస్తూ, వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గోపిని అభినందించారు. ప్రతి ఒక్కరూ ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ తాళ్లపూడి కీర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు తాళ్లపూడి అప్పలనాయుడుతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన

కొత్తవలస: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత అన్నారు. మండలంలోని ముసిరాం గ్రామంలో సోమవారం ఆమె పర్యటించారు. ఈ నెల 19న విజయవాడ స్వరాజ్ మైదానంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య ఫలాలు బడుగు, బలహీన వర్గాలకు అందాలన్న అంబేడ్కర్ ఆశయానికి అనుగుణంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర బీసీ సంఘం ప్రెసిడెంట్ పిల్లి నూకరాజు, యాత కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దమ్ము రమణ, తదితరులు పాల్గొన్నారు.

పందెంరాయుళ్ల అరెస్ట్

లక్కవరపుకోట: మండలంలోని భూమిరెడ్డిపాలెం గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోడిపందాల శిబిరంపై ఎస్సై ఆర్.గోపాలరావు ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం దాడి చేశారు. పందెం కోసం సిద్ధంగా ఉంచిన 8 కోడి పుంజులు, రూ.1130 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నూతన వస్త్రాల పంపిణీ

చీపురుపల్లి రూరల్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని వృద్ధులు, మహిళలకు పలువురు దాతలు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. చీపురుపల్లి మండలం రామలింగాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు, ఎంపీపీ ఇప్పిలి అనంతం, వెంకటనరసమ్మ దంపతులు గ్రామంలోని వృద్ధులు, మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. మహిళలకు 300 చీరలు, వృద్ధులకు 200 పంచెలు, తువ్వాళ్లను పంపిణీ చేసినట్లు చెప్పారు.

- మెంటాడ(గజపతినగరం రూరల్): గజపతినగరం మండలం కెంగువ గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు లెంక శ్రీనివాసరావు, తన కుమారుడు గణేష్ సోమవారం పేదలకు చీరలు, పంచెలు పంపిణీ చేశారు.
- గుర్ల: మండలంలోని మణ్యపురిపేటలో వంద మంది పేదలకు గ్రామ సర్పంచ్ బడుగంటి హైమవతి, బడుగంటి వెంకటరమణ దంపతులు మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు.
- దత్తిరాజేరు: మండలంలోని ఇంగిలాపల్లి గ్రామంలో 60 మంది పేదలకు గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ బమ్మిడి అప్పలనాయుడు వృద్ధులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు.


మెంటాడ: పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న లెంక శ్రీనివాసరావు, తదితరులు


గుర్ల: మహిళలకు దుస్తులు అందజేస్తున్న సర్పంచ్ హైమవతి, వెంకటరమణ దంపతులు


చీపురుపల్లి రూరల్: మహిళలకు చీరలు అందజేస్తున్న ఎంపీపీ ఇప్పిలి అనంతం, వెంకటనరసమ్మ దంపతులు


దత్తిరాజేరు: ఇంగిలాపల్లిలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ అప్పలనాయుడు

వైభవంగా బ్రహ్మలింగేశ్వరస్వామి తీర్థం


వేపాడ: కొండగుళ్లు బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయం కొండపై భక్తజనసందోహం


వేపాడ: కొండగుళ్లు కొండపై దాటుభజన చేస్తున్న ఆకులసీతంపేట భక్తులు


వేపాడ: కొండపై ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న తోమడపెద్దు భజన భక్తులు

వేపాడ: మండలంలో ప్రసిద్ధి చెందిన కొండగుళ్లు బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం అంగరంగ వైభవంగా తీర్థమహోత్సవం నిర్వహించారు. గుడివాడ, ఆకుల సీతంపేట, కరకవలస, చామలాపల్లి గ్రామాల మధ్య కొండపై ఉన్న బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రతి ఏటా కనుమ పండుగ రోజున తీర్థం నిర్వహిస్తారు. తీర్థానికి వచ్చేవారితో ఆలయ ప్రాంగణం జనసందోహంగా మారింది.

జాకేరు, గుడివాడ గ్రామాల నుంచి తీసుకొచ్చిన తోమడపెద్దులను భక్తులు కొండపైకి ఎక్కించి భజనలు చేశారు. ఆకులసీతంపేటకు చెందిన భక్తులు భజన చెట్టు వద్ద దాటుభజన నిర్వహించారు. కైలాసపురంలో ఉన్న ఈశ్వరుడు, పార్వతీదేవి విగ్రహాల వద్ద పలువురు ఫొటోలు తీసుకున్నారు. స్వామివారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- లక్కవరపుకోట: మండలంలో మంగళవారం నుంచి తీర్థాల సందడి ప్రారంభమైంది. శ్రీరాంపురం గ్రామంలోని సీతారామలక్ష్మణస్వామి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిడతలు, తప్పెటగుళ్లు తదితర సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ముందుగా స్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.


లక్కవరపుకోట: శ్రీరాంపురంలో రాములవారిని దర్శించుకుంటున్న భక్తులు


లక్కవరపుకోట: శ్రీరాంపురం ఆలయం వద్ద ఆకట్టుకున్న మహిళల కోలాటం

రోడ్డు భద్రత అందిరి బాధ్యత

- ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు


మాట్లాడుతున్న డిపో మేనేజర్ శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: ప్రమాద రహిత రవాణా కోసం డ్రైవర్లు బాధ్యతగా పని చేయాలని ఆర్టీసీ డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీలో రోడ్డు భద్రతా వారోత్సవాలను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు విధుల నిర్వహణకు వచ్చే ముందు మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలని అన్నారు. సంస్థ అందిస్తున్న నిరంతర శిక్షణను సద్వినియోగం చేసుకొని ప్రమాద రహిత సేవలను అందించాలని కోరారు. అనంతరం పక్షోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ బి.ఆదినారాయణ, మెకానికల్ ఇన్‌చార్జ్ ఎస్.హేమంత్ కిషోర్, డిపో సీహెచ్.రవికుమార్, డిపో సిబ్బంది పాల్గొన్నారు.